క్లుప్తంగా

కోడి పందెం, జూదం ఆడితే చర్యలు

వాల్మీకిపురం: సంక్రాంతి పండగను పురస్కరించుకొని గ్రామాల్లో కోడి పందెం, పేకాట తదితర చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ నాగేశ్వరరావు హెచ్చరించారు. శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా ఎక్కడైనా చట్టవ్యతిరేక కార్యక్రమాలు జరుగుతుంటే ప్రజలు తమకు సమాచారం అందించాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు అలాగే సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఊర్లకు వెళ్లే వారు విలువైన వస్తువులు, నగలు, డబ్బులు ఇంట్లో ఉంచకూడదని, సోషల్ మీడియాలో మీరు పెట్టే పోస్టుల వలన మీరే చిక్కుల్లో పడుతారని సూచించారు.

నలుగురు జూదరుల అరెస్టు

పెద్దతిప్పసముద్రం: మండలంలోని గంగంపల్లి సమీప పొలాల్లో జూదం జోరు అధికంగా సాగుతోందని ఫోన్ ద్వారా సమాచారం రావడంతో ఎస్‌ఐ రవీంద్రబాబు సిబ్బందితో కలసి పేకాట స్థావరంపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నలుగురు జూదరులను అరెస్టు చేశారు. వారి వద్ద లభించిన రూ.3,650ల నగదును స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ వెల్లడించారు.

అక్రమ మద్యం పట్టివేత

పెద్దతిప్పసముద్రం: మండలంలోని అంకాలమడుగు చెక్‌పోస్టు వద్ద ఎస్‌ఐ రవీంద్రబాబు సిబ్బందితో కలసి శుక్రవారం నాకాబందీ నిర్వహించారు. ఈ నేపథ్యంలో మండలంలోని రాపూరివాండ్లపల్లి పంచాయతి డి.నారాయణపల్లికి చెందిన రామాంజులు (33) కర్ణాటక రాష్ట్రం నుంచి అక్రమంగా 48 మద్యం ప్యాకెట్లను తరలిస్తూ పట్టుబడ్డాడు. అనంతరం రంగసముద్రం పంచాయతీ కొత్త సుబ్బరాయునిపల్లికి చెందిన ముబీనా (37) అనే మహిళ కూడా 48 మద్యం ప్యాకెట్లను తరలిస్తూ పట్టుబడినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. పట్టుబడిన నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపామని ఎస్‌ఐ తెలిపారు.

సచివాలయాల తనిఖీ

పెద్దతిప్పసముద్రం: మండలంలోని కాట్నగల్లు, రాపూరివాండ్లపల్లి, కందుకూరు, కమ్మచెరువు గ్రామాల్లోని సచివాలయాలను ఎంపీడీఓ గిరిధర్‌రెడ్డి శుక్రవారం అకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు, పని తీరుపై ఆరా తీశారు అనంతరం రికార్డులను పరిశీలించి పలు సూచనలిచ్చారు. ప్రజలతో మమేకమై సచివాలయాల సేవలపై గ్రామస్తులకు అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు.

పౌష్టికాహారంతో క్షయ నివారణ

మదనపల్లె : పోషకాహారం తీసుకోవడంతో పాటు క్రమం తప్పకుండా మందులు వాడితే క్షయనివారణ సాధ్యమవుతుందని జిల్లా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్. పద్మాంజలిదేవి అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా ఆస్పత్రిలో క్షయవ్యాధిగ్రస్తులకు ఆర్‌ఎంఓ ప్రసాద్‌రాజుతో కలిసి పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రధానమంత్రి టీబీ ముక్త్‌భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా దాతల సహకారంతో క్షయవ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. క్షయవ్యాధి రోగులు ఆరునెలలపాటు మందులు క్రమం తప్పకుండా, డాట్స్ పద్ధతిలో మందులు మింగాలని, ప్రతి ఒక్క ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో టీబీ కోసం మందులు, వైద్య పరీక్షలు పూర్తిగా ఉచితంగా అందిస్తారన్నారు. టీబీ పేషంట్‌లను దాతలు ఆరునెలల పాటు దత్తత తీసుకోవడానికి ముందుకురావాలని సూచించారు. కార్యక్రమంలో దాతలు నారాయణరెడ్డి, రంజిత్, మల్లికార్జున్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, అర్షద్, వెంకటేష్, రెడ్డెప్ప, అల్తాఫ్, ఇంద్రకుమార్, రాజేంద్రప్రసాద్, జిల్లా ఆస్పత్రి మదనపల్లె టీబీ విభాగం సిబ్బంది సిబ్బాల ప్రభాకర్, శాంతి, సుశీల, వనజకుమారి, తరుణ్, సునీత, సిబ్బంది పాల్గొన్నారు.

రైలు కింద పడి విద్యార్థికి గాయాలు

ములకలచెరువు : ప్రమాదవశాత్తు విద్యార్థి కాలుజారి రైలు కింద పడి గాయపడిన సంఘటన శుక్రవారం ములకలచెరువులో చోటుచేసుకుంది. 108 సిబ్బందికి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బి.కొత్తకోటకు చెందిన విద్యార్థి సతీష్ (19) విజయవాడలో చదువుతున్నాడు. సంక్రాంతి పండుగ సందర్భంగా సెలవులు కావడంతో నరసాపూర్ రైల్లో స్వగ్రామానికి బయలుదేరాడు. ఈ క్రమంలో ములకలచెరువు రైల్వే స్టేషన్లో రైలు దిగుతున్న సందర్భంగా ప్రమాదవశాత్తు కాలు జారీ కింద పడ్డాడు. ప్రమాదంలో సంతోష్ కుడికాలికి తీవ్ర గాయాలు కావడంతో 108 ద్వారా మదనపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఆటలతోనే మానసిక ప్రశాంతత

తంబళ్లపల్లె: యువతకు ఆటలతోనే మానసిక ప్రశాంతతో ఆరోగ్యం చేకూరుతుందని ఎంపీడీవో సురేంద్రనాథ్ తెలిపారు. రేణుమాకులపల్లె ఉన్నత పాఠశాల మైదానంలో ఆడుదాం-ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం క్రికెట్ సెమీఫైనల్ పోటీలు జరిగాయి. నాలుగు జట్లు పాల్గొనగా కొటాల జట్టు విజయం సాధించింది. కోటకొండ జట్టు రన్నర్‌గా నిలిచినట్లు పీడీ మొగల్‌ఖాదర్‌బాషా తెలిపారు. సర్పంచ్ మహ్మద్‌అలీ, పీఈటీలు చలపతిరెడ్డి, రాజు, పంచాయితీ కార్యదర్శి సాకెమ్మ తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు సంక్రాంతి సంబరాలు



సంక్రాంతి సంబరాల్లో భోగి మంటలు వెలిగిస్తున్న ఆర్డీఓ మురళి



ఎద్దుల బండిపై ఉత్సవాలు



కోడి పందేల పోటీ నిర్వస్తున్న దృశ్యం



సాంస్కృతిక కార్యక్రమాలు

- సందడిగా జెడ్పీహైస్కూల్ మైదానం
- ఆకట్టుకున్న కళారూపాలు, గంగిరెద్దులు, సాంస్కృతిక ప్రదర్శనలు

మదనపల్లె : మదనపల్లె పట్టణానికి సంక్రాంతి పండుగ శోభ ముందుగానే వచ్చింది. పట్టణంలోని జెడ్పీ హైస్కూల్ మైదానంలో నిర్వహించిన ముందస్తు సంక్రాంతి సంబరాలు కనువిందు చేశాయి. ప్రాంగణం మొత్తం గ్రామీణవాతావరణంలో పల్లెసీమలను ప్రతిబింబించేలా గొబ్బెమ్మలు, రంగురంగుల రంగవల్లులు, హరిదాసు కీర్తనలు, పిల్లనగ్రోవి వాయిద్యాలు, కోలాటాలు, గంగిరెద్దుల ఆటాపాటలు, లంబాడీల నృత్యాలు, కూచిపూడి, భరతనాట్యం ప్రదర్శనలతో చూపరులను కట్టిపడేశాయి. తెలుగుదనం ఉట్టిపడేలా సంప్రదాయ దుస్తుల్లో హాజరైన అధికారులు, మహిళలు, ప్రజలు సంక్రాంతి మధురానుభూతులను గుర్తుచేసుకుని ఆనందడోలికల్లో తేలియాడారు. కార్యక్రమంలో ఆర్డీఓ మురళీ, ఏపీఎండీసీ చైర్‌పర్సన్ షమీంఅస్లాం, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, కమిషనర్ ప్రమీల, తహసీల్దార్ మహబూబ్‌చాంద్ తదితరులు సంప్రదాయ దుస్తుల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సంక్రాంతి సంబరాల్లో ఆటపాటలతో అలరించిన చిన్నారులకు ప్రోత్సాహక బహుమతులు, ప్రశంసాపత్రాలను అందించారు.

మదనపల్లె మున్సిపల్ బడ్జెట్ రూ.212.04 కోట్లు

- రూ.99.71 కోట్లతో మిగులు బడ్జెట్
- నీటిసమస్య, మౌలికవసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత
- మున్సిపల్ ఆస్తుల పరిరక్షణకు కృషి చేయాలి



చైర్‌పర్సన్‌కు మనుజారెడ్డికి సమస్యలను వివరిస్తున్న కౌన్సిలర్ బి.ఏ.ఖాజా

మదనపల్లె : 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.212.04 కోట్లు మొత్తం ఆదాయంగా మదనపల్లె మున్సిపల్ బడ్జెట్‌ను శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ప్రవేశపెట్టారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో కౌన్సిల్ ప్రత్యేక సమావేశం జరిగింది. సమావేశంలో 2024–25 సంవత్సరానికి తయారుచేసిన బడ్జెట్ అంచనాలు, 2023–24 సంవత్సరానికి సవరించిన బడ్జెట్ అంచనాలు కౌన్సిల్‌లో ప్రవేశపెట్టగా సభ్యులు ఆమోదించారు. బడ్జెట్‌లో 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.212.04 కోట్ల అంచనా ఆదాయంగా కనపరుస్తూ... రూ.99.71 కోట్ల మిగులు బడ్జెట్‌గా పొందుపరిచారు. మొత్తం అంచనా వేసిన ఆదాయంలో రెవెన్యూ ఆదాయము రూ.51.36 కోట్లు కాగా, మూలధన ఆదాయం రూ.65.87 కోట్లుగా పేర్కొన్నారు. మొత్తం అంచనా ఆదాయం రూ.212.04 కోట్లుకు ఖర్చు రూ.112.32 కోట్లుగా కనపరిచి, అంత్యనిల్వ రూ.99.71 కోట్లుగా ప్రతిపాదిత బడ్జెట్‌లో పొందుపరిచారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి మాట్లాడుతూ... మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే నవాజ్‌బాషా సహాయ సహకారాలు, కృషితో మదనపల్లె మున్సిపాలిటీ ఆదర్శంగా నిలిచిందన్నారు. వార్షిక బడ్జెట్‌కు ఆమోదం తెలిపిన పాలకవర్గం సభ్యులకు అభినందనలు తెలుపుతూ, నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. మున్సిపల్ కమిషనర్ ప్రమీల మాట్లాడుతూ... బడ్జెట్‌లో ప్రధానంగా నీటిసమస్య పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇచ్చామన్నారు. అలాగే అన్నివార్డుల్లో మౌలికవసతుల కల్పనకు, అభివృద్ధి పనులకు సమానంగా కేటాయింపులు జరిపామన్నారు. కౌన్సిలర్లు బి.ఏ.ఖాజా, రాజేష్ పాల్‌చంద్రశేఖర్, గిరిజ సమస్యలపై మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు పాల్గొన్నారు.

శాకాహారమే శరీరానికి అమృతాహారం

కలికిరి: శాకాహారమే మనిషి శరీరానికి అసలైన అమృతహారమని పిరమిడ్ జేతవనం ధ్యాన ఆశ్రమ నిర్వాహకులు అన్నారు. సంక్రాంతి సందర్భంగా కలికిరిలో శుక్రవారం శాకాహార సద్భావన ర్యాలీ నిర్వహించారు. ధ్యాన ప్రియులు అధిక సంఖ్యలో పాల్గొని పెద్ద ఎత్తున నినాదాలతో ర్యాలీ చేశారు. శాకాహార ప్రాముఖ్యతపై కరపత్రాలు అందచేసి, ధ్యానంపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు.

కమనీయం.. గోదా రంగనాథస్వామి కల్యాణం

మదనపల్లె సిటీ: స్థానిక దేవళంవీధిలోని ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో శుక్రవారం శ్రీగోదా రంగనాథస్వామి కళ్యాణోత్సవం కన్నుల పండువగా జరిగింది. వేదపండితు లు వేదమంత్రోచ్చరణలతో కళ్యాణోత్సవం నిర్వహించారు. స్వామి,అమ్మవార్ల ఉత్సవ మూర్తుల విగ్రహాలకు ప్రత్యేకంగా అలంకరించారు. తిరుప్పావై ముంగింపు సందర్భంగా ప్రత్యేకంగా కార్యక్రమం నిర్వహించారు. వేదపండితులు బాలాజీ, లక్ష్మణలు శాస్త్రోక్తంగా కళ్యాణ క్రతువు నిర్వహించారు. కళ్యాణమహోత్సవ విశిష్టతను వేదపండితులు భక్తులకు వివరించారు.

సీఎం సహాయ నిధి చెక్కు పంపిణీ



సీఎం సహాయనిధి చెక్కను అందజేస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

గుర్రంకొండ: మండలంలోని మర్రిపాడు పంచాయతీ ఉసిరికాయలపల్లెకు చెందిన ఎం. గురుచరణ్‌కు సీఎం సహాయనిధి కింద మంజూరైన రూ.1.60 లక్షల చెక్కును ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అందజేశారు. గురుచరణ్ కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో బాధపడుతూ బయట రాష్ట్రాలోన్ని ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకొన్నాడు. ఇందుకు సంబంధించి ప్రభుత్వ సాయం కోరుతూ సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకొన్నాడు. ఎమ్మెల్యే సిఫార్సుతో బాధితుడికి సాయం మంజూరైంది. శుక్రవారం గుర్రంకొండలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో గురుచరణ్‌కు సీఎం సహాయనిధి చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు వైద్యసాయం అందించేందకు సీఎం ఎప్పుడు సిద్ధంగా ఉంటారన్నారు. కార్పోరేట్ స్థాయి వైద్యసేవలను ఉచితంగా అందిస్తున్న ఘనత సీఎంకే దక్కిందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సద్రీన్ ముక్తియార్, మండల ఆర్బీకే చైర్మెన్ జయచంద్రారెడ్డి, మండల ప్రత్యేక ఆహ్వానితులు అప్పల్ల, కందుల గుణశేఖర్, మాజీ ఎంపీపీ జమీర్, నాయకులు పురుషోత్తంరెడ్డి, గయాజ్ అహ్మద్, సుదర్శన్ పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం

కేవీపల్లె : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు వరం లాంటిదని ఎంపీపీ ఈశ్వరమ్మ, జెడ్పీటీసీ గజ్జెల శృతి అన్నారు. శుక్రవారం కేవీపల్లెలో జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. శిబిరంలో మొత్తం 306 మందికి వైద్యసేవలు అందించినట్లు గర్నిమిట్ట పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రేష్మ తెలిపారు.

మెరుగైన వైద్య సేవలు

నిమ్మనపల్లె : జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని ఎంపీడీఓ శేషగిరిరావు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్.రమేష్‌బాబు అన్నారు. శుక్రవారం నిమ్మనపల్లె మండలంలోని అగ్రహారం సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సర్పంచ్ ఉషారాణి, ఎంపీటీసీ కుసుమ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

317 మందికి ..

కలికిరి: మండలంలోని కలికిరి గ్రామ పంచాయతీ కలికిరి-4 గ్రామ సచివాలయం పరిధిలో శుక్రవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో 317 మంది వైద్య సేవలు పొందినట్లు వైద్యాధికారి చిన్నరెడెప్ప తెలిపారు. వీరికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశామన్నారు.

'పాలేగార్ల వారసత్వ సంపదను పరిరక్షిద్దాం'

పీలేరు రూరల్ : పాలేగార్ల వారసత్వ సంపదను పరిరక్షిద్దామదని ఆంధ్రప్రదేశ్ పాలేగార్ల వారసుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎనుగొండ కేశవులు నాయుడు అన్నారు. శుక్రవారం మండలంలోని జాండ్ల పంచాయతీ శ్రీ మద్గుండాల మల్లేశ్వరస్వామి ఆలయం వద్ద పాళేగార్ల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకతీయ, విజయనగర, గోల్కొండ, మొఘల్, మరాఠా పాలకుల కాలంలో శాంతిభద్రతలకు, వ్యవసాయ అభివృద్ధికి సుమారు 500 సంవత్సరాలు పాటు దోహదపడిన పాలేగాళ్లను సంఘ వ్యతిరేక శక్తులుగా చిత్రీకరించారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రచయిత తవ్వా ఓబుల్‌రెడ్డి, సంఘం రాష్ట్ర కోశాధికారి గురిగింజకుంట చంద్రప్పనాయుడు, వెంకటరమణనాయుడు, బలరామయ్య, వెంకటరమణనాయుడు, పెద్దరెడ్డెప్పనాయుడు, ప్రభాకర్‌నాయుడు, లక్ష్మీపతినాయుడు పాల్గొన్నారు.

అత్యాధునిక వైద్య సదుపాయం



పీలేరు రూరల్ : పట్టణంలో మొట్టమొదటి సారిగా అత్యాధునిక వైద్య సదుపాయంతో రేడియోలజి డాక్టర్ అందుబాటులో ఈటీసీటీ ఆల్ట్రా సౌండ్ స్కానింగ్, టిపా స్కానింగ్, కలర్ డాప్లర్ అందుబాటులోకి తీసుకురావడం జరిగింది. సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా మన పీలేరులోనే అత్యాధునిక సౌకర్యంతో అందుబాటులో కలదు.

– డాక్టర్ కృష్ణ చైతన్యరెడ్డి, స్టార్‌లైట్ దయాగ్నోస్టిక్, పీలేరు

తక్కువ ఖర్చుతో వైద్యం..



మదురైలోని అరవింద్ కంటి ఆసుపత్రిలో 30 నెలలు పని చేసి అనుభవం గడించిన నేను పీలేరు పట్టణంలో (కోటపల్లె రోడ్) అత్యాధునిక సౌకర్యాలతో కంటి ఆసుపత్రి ప్రారంభించామని తెలియచేయుటకు సంతోషిస్తున్నాము. పీలేరు పరిసర ప్రాంతాల వారు సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా ఇక్కడే తక్కువ ఖర్చుతో కంటి వైద్యం అందిస్తున్నాము.

– డాక్టర్ దేవులపల్లె మౌర్య రెడ్డి, పీలేరు